క్లుప్తంగా

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.23, నల్ల వంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 55, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 47, పచ్చకాకర 35, పందిరిబీర 45, క్యాబేజీ 9, క్యారెట్ 15, దొండ 23, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 40, గోకరకాయ 45, కీర 25, దోస కాయ 28, బీట్‌రూట్ 16, ఉల్లిగడ్డ 16, ఆలుగడ్డ 19, చామగడ్డ 70, మొరంగడ్డ 23, కంద గడ్డ 33, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటి కాయ 9 (ఒకటి), మునగకాయ 4–6, ముల్లంగి 3–5. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

వసుంధరకు డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పొలిటికల్ సైన్స్ విభాగం నుంచి యలమంచిలి వసుంధరకు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. విశ్రాంత అధ్యాపకురాలు ప్రొ.కస్తూరి లక్ష్మీ పర్యవేక్షణలో రాజకీయాలలో మహిళల భాగస్వామ్యం, పని తీరు అనే అంశం పై పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఆంధ్రమహిళా సభకాలేజీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తూ ఓయూ డాక్టరేట్‌ను పొందిన వసుంధరకు పలువురు అభినందనలు తెలిపారు.

గుర్తుతెలియని వృద్ధురాలి మృతి

సికింద్రాబాద్: చికిత్స పొందుతున్న ఓ గుర్తుతెలియని ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 15న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలోని ఇంజినీరింగ్ లోయర్ యార్డు వద్ద ఆగిఉన్న రైలు బోగీలో సుమారు 60 సంవత్సరాల వయసున్న వృద్ధురాలు అపస్మారక స్థితిలో ఉన్నట్లు గుర్తించి చికిత్స నిమిత్తం గాంధీకి తరలించారు. మూడ్రోజులు చికిత్స పొందిన వృద్ధురాలు ఆదివారం మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. మృతురాలి ఎడమచేతిపై పచ్చబొట్టుతో ముగ్గు, పసుపు రంగు చీర, గులాబీ రంగు జాకెట్ ఉందని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించామన్నారు.

రెయిలింగ్‌ను ఢీకొట్టిన కారు

- త్రుటిలో తప్పిన ప్రమాదం



సనత్‌నగర్: వేగంగా వచ్చిన ఓ కారు రెయిలింగ్‌ను ఢీకొట్టింది. ఆదివారం మధ్యాహ్నం ఫతేనగర్ నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్తున్న టీఎస్ 10ఈహెచ్ 8186 నెంబర్ గల కారు బల్కంపేట–బేగంపేట లింక్‌రోడ్డులోని నాలా వద్దకు రాగానే ఒక్కసారిగా రెయిలింగ్‌ను ఢీకొట్టింది. ఊహించని ఈ సంఘటనతో వెనుక వచ్చే వాహనదారులు వెంటనే అప్రమత్తం కావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఇక్కడి మూలమలుపులో వేగాన్ని అదుపు చేయలేక రెయిలింగ్‌ను ఢీకొట్టి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో లింక్‌రోడ్డులో ట్రాఫిక్ స్తంభించింది.

పుస్తకావిష్కరణ

రాంగోపాల్‌పేట్: విశ్వ తెలుగు సాహిత్య సంస్కృతి సభ (అట్లాంట) ఆధ్వర్యంలో ఆదివారం సికింద్రాబాద్‌లోని ఎస్వీఐటీ ఆడిటోరియంలో కవి వల్లూరి రమేష్ రచించిన 'రస రమ్య కవితా వల్లరి' పుస్తకావిష్కరణ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, తిరుపతి వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉప కులపతి రాణీ సదాశివమూర్తి, ప్రముఖ చారిత్రక రచయిత ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ముదిగొండ శివప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలుగు భాషను రక్షించుకోవాలనే తపనే రచయితలు ఎన్నో రచనలు కొనసాగిస్తూ ఎంతో మందికి తన సాహిత్యాన్ని అందిస్తున్నారని కొనియాడారు. 56 తెలుగు అక్షరాలకు ఒక్కో అక్షరానికి ఒక కవితలా 56 కవితలతో సరస్వతి తల్లికి నైవేద్యం సమర్పించారని అభినందించారు. అమెరికాలో ఉంటూ కూడా తెలుగు భాషపై ఉండే ఎంతో మమకారంతో ఇక్కడ భాష పరిరక్షణకు పాటు పడుతున్నారని అన్నారు. ధర్మం, వేధాలను మనం రక్షిస్తే అవి మనలను కాపాడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, సత్యప్రసాద్ పాల్గొన్నారు.

అలరించిన రామ గానలహరి

చిక్కడపల్లి: వర్ధమాన గాయకుడు సంపత్ కుమార్ నిర్వహించిన రామ గానలహరి శ్రోతలను ఆలరించింది. సాయిలలిత మ్యూజిక్ అకాడమి ఆధ్వర్యంలో సంపత్‌కుమార్ ఆదివారం త్యాగరాయ గానసభలో ఉదయం 9గంటలకు మధురమే సుధారసగానం పాటను మధురంగా ఆలపించి 1950 నుంచి విడుదల అయిన తెలుగు సినిమాలలో ఘంటసాల, బాలసుబ్రహ్మణ్యం, పీబీ శ్రీనివాస్, రామకృష్ణ పాడిన తన గళంలో నిర్విరామంగా 12 గంటల పాటు పాడి రాత్రి 9 గంటలకు విశేష ప్రేక్షక ప్రశంసలతో ముగించారు. టీవీరావు, గొర్తి చంద్రశేఖర్, వినోద్‌బాబులు పాల్గొన్నారు.



పేదోడి సొంతింటి కల నెరవేరింది..

సాయన్న చొరవతోనే..

ఎమ్మెల్యే సాయన్న మరణంతో కంటోన్మెంట్‌లో అలుముకున్న విషాదఛాయలు

కంటోన్మెంట్/రసూల్‌పురా: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పేదలకు అందించడంలో దివంగత ఎమ్మెల్యే సాయన్న ఎనలేని కృషి చేశారు. కంటోన్మెంట్‌లో అత్యధికంగా పేదలు పది నుంచి ఇరవై గజాల్లో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటుండడంతో సాయన్న వారికి సొంత ఇంటి కలను నెరవేర్చారు. టీడీపీ హయాంలో ఎమ్మెల్యేగా ఉన్న సాయన్న అటల్ బిహారి వాజ్‌పేయి వాల్మీకి అవాస్ యోజన పథకం (వాంబే) ద్వారా రసూల్‌పురా కట్టమైసమ్మ బస్తీలో 555, తిరుమలగిరి ఎల్ఐసీ కార్యాలయం సమీపంలో 336 మందికి ఇళ్ల మంజూరు చేయించారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొత్తం 1365కు పైగా ఇళ్లు అందేలా ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ప్రస్తుతం రసూల్‌పురాలో నారాయణ జోపిడి సంఘం వద్ద మరో 304 మంది పేదలకు ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. తమకు సొంతింటి కలను నెరవేర్చిన ఎమ్మెల్యే సాయన్న హఠాన్మరణం పట్ల ఆయా ప్రాంతాల ప్రజలు కన్నీటి పర్యంతమవుతున్నారు.



అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో(ఫైల్)



ఎమ్మెల్యే సాయన్న నివాసంలో భౌతికకాయం వద్ద విలపిస్తున్న బంధువులు, అభిమానులు

సాయన్న మరణం తీరని లోటు..

లాలాపేట: కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న మరణం బాధాకరమని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి అన్నారు. ఐదు పర్యాయాలు శాసన సభ్యుడిగా కంటోన్మెంట్ ప్రాంతానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం అన్నారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని మంచి ప్రజా నాయకుడు సాయన్న అని ఆయనతో తనకు ఉన్న రాజకీయ సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు.



ఎటు చూసినా సాయన్న 'బోర్డు'లే!

కంటోన్మెంట్: మూడు దశాబ్దాలుగా కంటోన్మెంట్ రాజకీయాల్లో కీలక నేతగా కొనసాగిన సాయన్న 25 ఏళ్ల పాటు ఎమ్మెల్యేగా ఉన్నారు. కేంద్ర ప్రభుత్వ అధికారులు, మిలటరీ అధికారుల పర్యవేక్షణలో పాలన సాగే కంటోన్మెంట్‌లో రాష్ట్ర ప్రభుత్వ పాత్ర పరిమితంగానే ఉంటుంది. అయినప్పటికీ సాయన్న ప్రతి కాలనీలోనూ తన పేరు చిరస్థాయిగా నిలిచిపోయేలా పనులు చేశారు. పైప్‌లైన్ ద్వారా నీరు ఇవ్వడం మినహా కంటోన్మెంట్ బోర్డు అధ్వర్యంలో ఎక్కడా మంచినీటి బోర్లు వేసిన దాఖలాల్లేవు. ఈ నేపథ్యంలో స్థానిక ప్రజలు తాగునీటి అవసరాల కోసం ఎమ్మెల్యేను ఆశ్రయించేవారు. దాదాపు 300 కాలనీలు, బస్తీల్లో సాయన్న తన ఎమ్మెల్యే నిధులతోనే బోర్లు వేయించారు. కంటోన్మెంట్ ఉన్న కమ్యూనిటీహాళ్లలో 90 శాతానికి పైగా సాయన్న హయాంలోనే నిర్మించినవే అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.అందుకే కంటోన్మెంట్‌లో ఎక్కడికెళ్లినా సాయన్న నేమ్ ప్లేట్‌తో ఉన్న బోర్డులే దర్శమిస్తాయి.



సాయన్న హయాంలో నిర్మించిన డబుల్ బెడ్రూమ్‌లు

ఫుట్‌బాల్ పోటీలు షురూ

రసూల్‌పురా: కంటోన్మెంట్ తిరుమలగిరి ఫుట్‌బాల్ మైదానంలో యూనిటీ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 19 నుంచి మార్చి5వ తేదీ వరకు హైదరాబాద్ జిల్లాస్థాయిలో జరిగే కార్డినల్ పూలా అంథోని ఫుట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభమైంది. రెవరెండ్ ఫాదర్ డాక్టర్ వీకే.స్వామి, రెవరెండ్ ఫాదర్ రాజు అలెక్స్, అకాడమీ చైర్మన్ పి. లూయిస్ అరుణ్‌రాజ్, భారత ఫుట్‌బాల్ జట్టు మాజీ కెప్టెన్ విక్టర్ అమూల్‌రాజ్ ముఖ్య అతిథులుగా హాజరై జెర్సీలను ఆవిష్కరించి పోటీలను ప్రారంభించారు. 16 జట్లు పాల్గొనగా మొదటి మ్యాచ్ హీరోస్ క్లబ్, హైదరాబాద్ గ్లోబ్ జట్ల మధ్య జరగగా హైదరాబాద్ గ్లోబ్ విజేతగా నిలిచింది. ఈ కార్యక్రమంలో టీసీబీసీ సెక్రటరి రెవరెండ్ ఫాదర్ సాగయ్య రాజ, చైర్మన్ ఎడ్వర్డ్ జక్రాయిస్, పాల్గొన్నారు.



జెర్సీని ఆవిష్కరిస్తున్న దృశ్యం

బీఆర్‌ఎస్ నేత సిరాజుద్దీన్ కన్నుమూత

సనత్‌నగర్: బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నేత సయ్యద్ సిరాజుద్దీన్ (66) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఇటీవల కోలుకుని ఆస్పత్రి డిశ్చార్జి అయినప్పటికీ మళ్లీ అనారోగ్య సమస్యలు తలెత్తడంతో మరోసారి ఆస్పత్రిలో చేరారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం తుదిశ్వాస విడిచారు. జామ్రీ మసీదు అధ్యక్షుడు, సనత్‌నగర్ ఈద్గా ప్రెసిడెంట్, డీఎస్ఎం కాలనీ అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ పార్టీ నేతగా సిరాజుద్దీన్ అందరికీ సుపరిచితం. అన్ని పార్టీల నేతలతో ఆయన మైత్రిని కొనసాగిస్తూ వచ్చారు. సిరాజుద్దీన్ మృతి వార్త తెలుసుకున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు బాల్‌రెడ్డి, ఖలీల్‌బేగ్ ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



సిరాజుద్దీన్ కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న మంత్రి తలసాని

కనుల పండువగా కల్యాణోత్సవం



కల్యాణోత్సవానికి హాజరైన కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సీతాఫల్‌మండి రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం శివ పార్వతుల కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. ఆలయ చైర్మన్ నోముల ప్రకాశ్‌రావు, ఈఓ జీ.శ్రీనివాసుల ఆధ్వర్యంలో జరిగిన కల్యాణోత్సవానికి కార్పొరేటర్ సామల హేమ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు మురళీధరశర్మ, రంగం వేణుగోపాలా చార్యులు, రఘునందన్, సుధాకర్, మల్లేశ్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానంలో..

సనత్‌నగర్: మహాశివరాత్రి మహోత్సవాల్లో భాగంగా సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం ప్రాంగణంలోని భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి వారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. దేవాదాయ, ధర్మదాయ శాఖ తరుపున కార్పొరేటర్ కొలను లక్ష్మీ, బాల్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలను సమర్పించారు. ఈఓ శ్రీనివాసరాజు పర్యవేక్షణలో ఆలయ అర్చకులు రిపుంజయశర్మ ఆధ్వర్యంలో మల్లికార్జునస్వామి వారికి అభిషేకం, అర్చన, సామూహిక పూజలను జరిపారు. సామూహిక రుద్రాభిషేకం, నానా ఫల రసాభిషేకం, శివపార్వతుల ఊయల సేవ తదితర కార్యక్రమాలను కొనసాగించారు. పూజాది కార్యక్రమాల్లో దేవాదాయ అర్చక, ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు పరాశరం రవీంద్రాచార్యులు, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

శారీరక దృఢత్వానికి క్రీడలు దోహదం

పద్మారావునగర్: క్రీడలు, మానసిక వికాసంతో పాటు శారీరక దృఢత్వానికి ఎంతో దోహదపడుతాయని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఓల్డ్ గాస్ మండి గ్రౌండ్‌లో నిర్వహించిన క్రికెట్ పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువత సెల్‌ఫోన్‌కు ఇస్తున్న సమయం క్రీడలకు ఇవ్వడం లేదన్నారు. క్రీడల కోసం కొంత సమయాన్ని కేటాయించాలన్నారు. అంతకు ముందు మంత్రి కాసేపు బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు వినాయక్, వినోద్, సుశీల్, వినయ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్ పాల్గొన్నారు.



బ్యాటింగ్‌తో పోటీలను ప్రారంభిస్తున్న తలసాని



ప్రసంగిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈటల రాజేందర్



శోభాయాత్రలో పాల్గొన్న నెమలి అనంద్



బౌద్ధనగర్‌లో శోభాయాత్రలో పాల్గొన్న కార్పొరేటర్ కంది శైలజ

శివాజీ స్ఫూర్తి.. యువతకు దిక్సూచి

ఛత్రపతి శివాజీ జయంతి పురస్కరించుకుని ఆదివారం సికింద్రాబాద్, సనత్‌నగర్ నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. ఆయా కూడళ్లలోని శివాజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు సంఘాల ఆధ్వర్యంలో జయంతి ర్యాలీలు నిర్వహించారు. వీర శివాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పాల్గొని ప్రసంగించారు. అమీర్‌పేట డివిజన్ గురుద్వార్ వద్ద నిర్వహించిన జయంతి ర్యాలీలో మంత్రి తలసాని పాల్గొన్నారు. ఆయా డివిజన్లలో కార్పొరేటర్లు పాల్గొని శివాజీ చిత్రపటానికి నివాళులర్పించారు.

–సికింద్రాబాద్, సనత్‌నగర్ జోన్ల బృందం



జయంతి ర్యాలీలో పాల్గొన్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



జనరల్‌బజార్‌లో..



మోండాలో శివాజీ జయంతి ర్యాలీ..



అడ్డగుట్ట గల్లి బాయ్స్ ఆధ్వర్యంలో..



ప్రొ. జయశంకర్ స్టేడియం వద్ద..